# నిర్ణయం

— జి. సరస్వతి

అమెరికాలో ఒక వీకెండ్!

సైట్ సీయింగు, షాపింగు చేసి తిరిగి వస్తున్న దుర్గ, వినోద్ ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కున్నారు. దుర్గ కారు ఆపీ ఆపడంతోనే ముందున్న కారులోంచి ఒక యువకుడు దిగి వచ్చి, ఆమె కారు తగిలి తన కారు దెబ్బ తిన్నదని గొడవచేయటం మొదలుపెట్టాడు. దుర్గ కారు దిగి వెళ్లి పరిశీలించి తన కారు అతని కారుని తాకిన మాట నిజమేకాని దానికి ఏమీ డ్యామేజి కాలేదని చెప్పింది.

కాని ఆ యువకుడు వినిపించుకోలేదు. తనకు నష్ట పరిహారం చెల్లించి తీరాలని, లేకపోతే రిపోర్టు చేస్తానని, కోర్టుకు వెళ్తానని బెదిరించడం మొదలుపెట్టాడు. నష్ట పరిహారం చెల్లించవలసిన అవసరం తనకేమీ లేదని దుర్గ వాదించింది. పావుగంటకు పైగా సాగిన వారి వాగ్వివాదం వాహనాలు కదలడంతో అంతమైంది. అతను తన కారులోకి దూకి స్టార్టు చేశాడు. దుర్గ అలసటగా వచ్చి డ్రైవింగు సీటులో కూలబడింది.

అంతసేపూ కారులోనే కూర్చొని ఆమె వాగ్ధాటికి అచ్చెరువందుతూ, కోపంతో ఎరుపెక్కిన ఆమె అందమైన మొహాన్ని చూస్తూ పరవశించిపోయిన వినోద్ ఆమె కారెక్కగానే, ''హ్యాట్సాఫ్ దుర్గా'' అన్నాడు.

''అన్యాయాన్నెదిరించినపుడు అపరదుర్గవే అనిపించావు. అంతేకాదు. కోపంలో నువ్వెంత అందంగా కనబడ్డావ్'' అన్నాడు ప్రశంసాపూర్వకంగా.

''అంటే? నేనందంగా కనబడాలంటే ఎప్పుడూ కోపంగా ఉండాలేమో!'' అంది కొంటెగా నవ్వుతూ.

''ఊహు! అప్పుడప్పుడైతేనే బాగుంటుంది'' అన్నాడు వినోద్ తనూ నవ్వేస్తూ.

అరగంట తరువాత కారు వినోద్ బస చేసిన హోటల్ ముందు ఆపింది దుర్గ.

''బాగా అలసటగా ఉంది దుర్గా! రెస్టు తీసుకోవాలి బై'', అనేసి వినోద్ కారుదిగి వెళ్లిపోయాడు.

చాలా దూరం డ్రైవ్ చేసి బాగా అలిసిపోయింది దుర్గ. గొడవ కూడా తోడవటంతో అప్‌సెట్ అయింది కూడ. వినోద్‌తో వెళ్లి కాఫీ త్రాగి రిలాక్స్ అవుదామనుకుంది. కాని అతను రమ్మనకపోవడంతో నిరాశపడి తన అపార్టుమెంటు వైపు కారుని మళ్లించింది.

• • •

రాత్రి పదకొండుగంటలు! దుర్గ పనులు ముగించుకొని పక్కమీద వాలబోతూ ఉండగా ఫోన్ మ్రోగింది. విసుక్కుంటూ రిసీవరు అందుకొని, ''హలో'' అంది బద్ధకంగా.

''నేను దుర్గా! వినోద్‌ని'' అన్నాడు. అతని గొంతు వినగానే నిటారుగా అయింది.

''ఇంతరాత్రప్పుడు ఎందుకు ఫోన్ చేసేవు?'' అని అడిగింది.

''ఇక్కడ నేను, అక్కడ నువ్వు రిలాక్స్ అయే టైము కనుక మంచి కబురు చెప్పి ఆనందపడాలని'' అతని గొంతులో ఉత్సాహం.

''ఏమిటది?'' ఆమె గొంతులో నిరాసక్తత. అది పట్టించుకోకుండానే అతను చెప్పుకుపోయాడు.

''నువ్వు నాకు బాగా నచ్చావు దుర్గా! పెద్దవాళ్లతో చెప్పి ఇండియా వెళ్లి పెళ్లి చేసుకుందాం!'' అని.

''సారీ వినోద్! నేను నిన్ను చేసుకోలేను'' అంది దుర్గ సూటిగా, క్లుప్తంగా. వినోద్ అదిరిపడ్డాడు.

''దుర్గా!



ఏమైంది? మనం చాలాసార్లు కలుసుకున్నాం. ఒకరికొకరం దగ్గరయాం. మన అభిప్రాయాలూ, అభిరుచులు చాలావరకు కలుస్తున్నాయని, చిన్న తేడా లున్నా సర్దుకుపోగలమని అన్నావే!''

''కాదనడం లేదు వినోద్! కాని సాయంత్రం జరిగిన సంఘటనల వల్ల మనస్సు మార్చుకోవలసి వచ్చింది.''

''సాయంత్రం నేనేం చేసేను దుర్గా?''

''ఏమీ చెయ్యలేదనే?''

''అంటే?''

''గొడవ జరుగుతున్నంతసేపు నువ్వు కార్లోనే ఉండిపోయావుకదా?''

''అవును. గొడవల్లో తల దూర్చడం నాకు ఇష్టం ఉండదు. అందుకే మౌనంగా ఉండిపోయాను''

''హోటల్ దగ్గిర కారాపగానే 'బై' చెప్పేసి వెళ్ళిపోయావు కదా?''

''అలసటగా ఉండి వెళ్లిపోయాను. తప్పా?''

''అయినా ఆ సంఘటనలకి మన పెళ్లికి ఏం సంబంధం?'' అడిగాడు అసహనంగా.

''సంబంధం ఉంది వినోద్! నువ్వు భార్యతో సరదాలు, విలాసాలు పంచుకొంటావే తప్ప ఒడిదుడుకుల్లో తోడుగా నిలబడవని, ఆమె అలసటను, శ్రమను పట్టించుకోకుండా నీ సుఖం నువ్వు చూసుకొనే స్వార్థపరుడవని నాకు అర్థమైంది. అందుకే నేను నిన్ను చేసుకోలేను. గుడ్ బై'' అని ఫోను పెట్టేసింది దుర్గ.

చదువు వంకతో చిన్నప్పటినించి ఒక్క పని కూడ చేయకుండా, కన్నవాళ్ల తోబుట్టువుల శ్రమను గురించి పట్టించుకోకుండా వారి చేత పనులు చేయించుకుంటూ పెద్దవాడయాడు వినోద్. మంచి ఉద్యోగం, అందం, అన్ని పనుల్లో సమర్థత, చొరవ ఉన్న దుర్గ తనకు తారసపడటంతో చాలా ఆనందించాడు. ఆమెను పెళ్లి చేసుకొని సంసార భారాన్ని ఆమె పైకి పూర్తిగా నెట్టి తను కులాసాగా బ్రతకాలనుకున్నాడు. కాని కథ అడ్డం తిరగడంతో నిరాశతో, నిస్పృహతో మంచం మీద వాలిపోయాడు.

★